క్లుప్తంగా

నేడు రైతులతో ముఖాముఖి


పోతవరం గ్రామంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీపీ

నాగులుప్పలపాడు: జగనన్న శాశ్వత భూ హక్కు, శాశ్వత భూ రక్ష పథకంపై సోమవారం పోతవరంలో రైతులకు అవగాహన కార్యక్రమంతో పాటు ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, పొగాకు బోర్డు సభ్యులు మారెడ్డి సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా అగ్రిమిషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, కలెక్టర్ దినేష్ కుమార్‌తో పాటు జిల్లా సర్వే అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సభ ఏర్పాట్లను ఆదివారం సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి పరిశీలించారు.

సీసీవైఏ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం


పండుగలో చిన్నారులను ఆశీర్వదిస్తున్న సీనియర్ పాస్టర్ జాన్ అగస్టీన్

ఒంగోలు: స్థానిక క్లోపేట క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ (సీసీవైఏ) ఆధ్వర్యంలో ఆదివారం మట్టల పండగ ఘనంగా జరిగింది. చిన్నారులు దేవునిపాటలతో ర్యాలీ నిర్వహించగా వారిని జేఎంబీసీ సీనియర్ పాస్టర్ జాన్ అగస్టీన్ ఆశీర్వదించారు. అనంతరం చిన్నారులకు స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని సీసీవైఏ అధ్యక్షుడు వై.రంజిత్ తదితరులు పర్యవేక్షించారు.

కరువు భత్యం వెంటనే చెల్లించాలి


ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ శ్రావణ్‌కుమార్

ఒంగోలు: ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన కరువు భత్యం వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో జరిగిన ఏపీ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షులు కమ్మ మల్లిఖార్జునరావు మాట్లాడుతూ గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో పనిచేసి క్రమశిక్షణ చర్యలకు గురైన ఉపాధ్యాయులపై తిరిగి చర్యలు తగవన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పదో తరగతి పరీక్షల సక్రమ నిర్వహణకు ప్రభుత్వం కృషి చేయాలని, ప్రతి చిన్న విషయానికి ఉపాధ్యాయులను బాధ్యులుగా చేయడం తగదన్నారు. పరీక్ష రోజు సెలవు ప్రకటించిన పాఠశాలలు తిరిగి సెలవు రోజుల్లో పనిచేయాలనడం సమంజసంగా లేదన్నారు. ఏకేవీకే కాలేజీ ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరెడ్డి, జిల్లా బాధ్యులు నరసింహారావు, గుణ ప్రసాద్, టీవీ శేషారావు, ఏ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు

త్రిపురాంతకం: దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలు అందించేందుకు మార్కాపురంలో ఈ నెల 5న ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ దివ్యాంగుల జోనల్ ఇన్‌చార్జి ఎం శ్యామ్ తెలిపారు. మార్కాపురం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు డి.గోపాల్‌రెడ్డి నేతృత్వంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అవయవాలు లేనివారు ముందుగా వచ్చి కొలతలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఆధార్, రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్, 4 ఫొటోలతో హాజరుకావాలని కోరారు.

మాట తప్పని నేత సీఎం జగనన్న

- వైఎస్సార్ ఆసరా పంపిణీలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు


నాగులుప్పలపాడు: ఆసరా చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్ బాబు


నాగులుప్పలపాడు: సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్ బాబు

నాగులుప్పలపాడు: మాట తప్పని మడమ తిప్పని నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాటిస్తే దానిని నెరవేర్చడమే తన ధ్యేయంగా పని చేస్తున్నారని సంతనూతలపాడు శాసనసభ్యుడు టి.జె.ఆర్ సుధాకర్ బాబు అన్నారు. వైఎస్సార్ ఆసరా 3వ విడత చెక్కుల పంపిణీ కార్యాక్రమం వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో ఆదివారం అమ్మనబ్రోలులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో కరువు తాండవించి డ్వాక్రా రుణాలు చెల్లింపులో విసిగి వేసారన్నారు. ఆ సమయంలో అక్క చెల్లెమ్మలుకు తన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో అప్పటి వరకు ఉన్న 25 వేల కోట్ల 571 కోట్ల రూపాయల అప్పును నాలుగు విడతల్లో చెల్లిస్తానన్న హామీని జగనన్న ఇచ్చారన్నారు. అలా క్రమం తప్పకుండా ఈనాడు 3వ విడతగా అప్పును చెల్లించి తన మాటను నిలబెట్టుకున్నారన్నారు. నాగులుప్పలపాడు మండలంలో 3వ విడత ఆసరా కార్యక్రమంలో 1542 స్వయం సహాయక సంఘాలకు 13 కోట్ల 59 లక్షల 99 వేల రూపాయలను చెల్లించినట్లు చెప్పారు. మాయ మాటలు చెప్పి కాలం వెళ్ళదీసే నాయకుల మోసాలను నమ్మకుండా అక్కచెల్లెమ్మలు అంతా రాబోయే కాలంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి అండగా ఉండాలని కోరారు. ముందుగా వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి డ్వాక్రా మహిళలతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆసరా చెక్కును అందజేశారు. ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, మారెళ్ళ బంగారుబాబు, మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, కంచర్ల సుధాకర్, కుమ్మారి సుధాకర్, అమ్మనబ్రోలు గ్రామ సర్పంచ్ బత్తుల రవీన, పెనుబోతు రంగారావు, పులిచర్ల పరంధామి రెడ్డి, ఇనగంటి వెంకట రమణారెడ్డి, కాట్రగడ్డ శ్రీనివాసరవు, కోయి హనుమయ్య, కొండయ్య, ఉన్నం శ్రీను, హత్తి, కాటూరి ఆదియ్య, తుపాకుల హరి, ఏరియా కోఆర్డినేటర్ విజయమ్మ, ఏపీఎం రవికుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

మద్దిపాడు: అందరూ బాగుండాలనే కోరుకునే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలన నినాదం జగనన్నే మా నమ్మకం ప్రతి ఇంటికి వెళ్లేలా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు చొరవ చూపాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు అన్నారు. ఆదివారం ఒంగోలు వైఎస్సార్ విజయభవన్‌లో మద్దిపాడు మండల నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ నాయకుల సమీక్ష సమావేశంలో పలు సూచనలు చేశారు. జగనన్నే మా నమ్మకం అనే నినాదంతో ఈ నెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరుగు కార్యక్రమంలో ప్రతి సచివాలయ పరిధిలో కన్వీనర్‌లు గృహ సారథులు, వలంటీర్లను సమన్వయం చేసుకొని ప్రభుత్వ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను అర్థమయ్యేలా వివరించాలన్నారు. మండల కన్వీనర్ మండవ అప్పారావు, మోరబోయిన సంజీవరావు, నర్రా సురేష్ బాబు, బత్తుల శ్రీనివాసరావు, ఆయా గ్రామాల నాయకులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.


మద్దిపాడు మండల సచివాలయ కన్వీనర్లు, నాయకులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే


నాగులుప్పలపాడు: వైఎస్సార్ క్రాంతి పథం స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్ బాబు

లాజిక్ ఈఏపీసెట్‌కు ఉచిత శిక్షణ

ఒంగోలు టౌన్: ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద విద్యార్థులకు ఒంగోలు లోని అంజయ్య రోడ్డులోగల లాజిక్ అకాడమీ ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ పాలపర్తి విజయ భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పిస్తామని పేర్కొన్నారు. ఈనెల 10 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం అవుతాయని, ఆసక్తి కలిగిన విద్యార్థులు 8వ తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9985839758 నంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

కరాటే గ్రేడింగ్ బెల్ట్‌ల పంపిణీ


గ్రేడింగ్ బెల్ట్‌లను సాధించిన కరాటే విద్యార్థులు

చీమకుర్తి: మండల స్థాయి కరాటే గ్రేడింగ్ బెల్ట్‌ల పోటీల్లో పలువురు కరాటే విద్యార్థులు తమ ప్రతిభా నైపుణ్యాలను ఆదివారం చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో ప్రదర్శించారు. తథాగతి బోధి మార్షల్ ఆర్ట్స్ ఎగ్జామినర్ డి.వెంకటేష్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. కరాటే విద్యార్థులకు స్థానిక డీఎస్పీ సుధాకర్ కోచ్‌గా వ్యవహరించారు. ఎల్లో, ఆరంజ్ విభాగాల్లో ప్రతిభ చూపిన వారికి గ్రేడింగ్ బెల్ట్‌లను శివం ఫౌండేషన్ అధ్యక్షులు గొల్లపూడి శ్రీహరి చేతుల మీదుగా అందించారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం


కె.పల్లెపాలెం కల్యాణ మహోత్సవంలో డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర శాంతాకుమారి

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీరామ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీవాణి విద్యానికేతన్, శ్రీరామ్ బాల సంస్కార కేంద్రాల ఆధ్వర్యంలో ఆదివారం కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కె.పల్లెపాలెం బిల్డింగుల పాలెంలో వేంచేసి ఉన్న శ్రీ సీతరాములవారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా కల్యాణ మూర్తులను ప్రత్యేక అలంకరణతో చాపల వంశీకృష్ణ ఇంటి దగ్గర నుంచి మేళ తాళాలతో ఊరేగింపుగా వేదిక దగ్గరకు తీసకొచ్చారు. శ్రీరామ్ బాల సంస్కార కేంద్రాల విద్యార్థులు పదర్శించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాభివృద్ధికి సాయం చేసిన దాతలు ఒంగోలు నగరానికి చెందిన సాంబశివరావు, చీమకుర్తికి చెందిన బాలకృష్ణ, పల్లెపాలెంలో ఉన్నత చదువులు చదివిన మొదటి తరం ఉద్యోగులు నాయుడు జగ్గయ్య, విశ్వనాథల్లి ప్రసాద్‌రావును చాపల వంశీకృష్ణ కుటుంబ సభ్యులు సత్కరించారు. ఐదు వేలమందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీరామ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేతలు డాక్టర్ శాంతకుమారి, డాక్టర్ వంశీకృష్ణ, శ్రీవాణి విద్యానికేతన్ డైరెక్టర్ చాపల కోటేశ్వరరావు, చాపల వినుకొండయ్య, ఒంగోలు డివిజన్ పోలీస్ ఐటికోర్ టీం ఇన్‌చార్జ్ చాపల శ్రీనివాసులు, జేవీకే ఒన్నూరప్ప, శ్రీరామ బాల సంస్కార కేంద్రాల ఉపాధ్యాయులు సంధ్య, శిరీష కుమారి, అంజలి, గ్రామ కాపు సైకం పోతు రాజు, రామాలయం కమిటీ సభ్యులు చాపల మహేంద్ర పాల్గొన్నారు.

అధ్యయనం, అవగాహనతో పంచాంగ పునర్‌వైభవం


మాట్లాడుతున్న ప్రముఖ పంచాంగ కర్త పండిత బట్టే వీరభద్ర దైవజ్ఞ

ఒంగోలు: అధ్యయనం, అవగాహనతో పంచాంగ పునర్ వైభవం సిద్ధిస్తుందని, పరిశోధన లేకుండా మిడిమిడి జ్ఞానంతో విమర్శలు తగవని పలువురు పంచాంగ కర్తలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సంతపేట సాయిబాబా మందిరంలో తేజస్వి జ్యోతిష వాస్తు వేద పరిశోధన కేంద్రం ఉగాది, జూటూరి పంచాంగ రచనా రజతోత్సవ కార్యక్రమం జరిగింది. సనాతన వైదిక ధర్మం, భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకుంటూ సంస్కృతంపై అధ్యయనం అవగాహన పెంచుకోవాలని, పంచాంగం పునర్‌వైభవం సాదించేందుకు మిక్కిలిగా పరిశోధనలు చేయాలన్నారు. ప్రముఖ పంచాంగ కర్త పండిత బట్టే వీరభద్ర దైవజ్ఞ మాట్లాడుతూ పంచాంగ వైశిష్ట్యం వారం, తిథి, నక్షత్రం ప్రధానంగా శాస్త్రంపై అధ్యయనం అవగాహన కలిగి ఉండాలన్నారు. పంచాంగ కర్తలలో వైరుధ్యాలు చోటుచేసుకుంటున్న కారణంగా వివాదాలు వస్తున్నట్లు పేర్కొన్నారు. విమర్శలు, వివాదాల నివృత్తికి ప్రాథమిక స్థాయి నుంచి సంస్కృతం, పంచాంగం తిథి, వారం, నక్షత్ర శాస్త్రం గురించి అవగాహన కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామ స్థాయిలో అర్చకులు, పౌరోహితులు, యాగ్నీకులు సనాతన వైదిక ధర్మ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. రెండున్నర దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాల్లో సనాతన ధర్మం కాపాడేందుకు పంచాంగ రచన చేస్తూ పునర్ వైభవానికి డాక్టర్ జూటూరి భానుమూర్తి కృషి చేస్తున్నారంటూ ఆయనను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర, తెలంగాణ రెండు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ పంచాంగ కర్తలు ఇంద్రగంటి ప్రసాద్ శర్మ, చింతా గోపి శర్మ, డాక్టర్ నీలం పూర్ణ మోహన్, దేవరభొట్ల భవానిశర్మ, శిష్ట సూర్యనారాయణ, ఇంద్రగంటి సాయినాథ శర్మ, డి.వి సాయినాథ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువ పంచాంగ కర్తలను ఉగాది పురస్కారాలతో సత్కరించారు.

ఘనంగా ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల


శ్రీప్రసన్నాంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు


స్వామివారికి పొంగళ్ళతో హాజరైన భక్తులు

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం గుమ్మనంపాడులోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ళ ఆదివారం స్థానిక భక్తుల ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక భక్తులు పొంగళ్ళు పెట్టి తమ మొక్కులను తీర్చుకున్నారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి సమాజం వారు ఆనవాయితీగా అన్నదానం చేశారు. తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన కుంచాల రాజు, ఆలూరి వెంకటేశ్వర్లు, చలపతి, రాజేష్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత మంచినీరు, మజ్జిగ పంపిణీ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్, టీడీపీ ఆధ్వర్యంలో రెండు విద్యుత్ ప్రభలను నిర్మించారు.

సంతనూతలపాడు, చీమకుర్తి, కొండపి, మర్రిపూడి మండలాల నుంచి వేలాది మంది భక్తులు తిరునాళ్ళకు వచ్చి స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

అట్టహాసంగా రఘునాయకుని బ్రహ్మోత్సవాలు


హంస వాహనంపై ఊరేగుతున్న రఘునాయక స్వామి

నాగులుప్పలపాడు: శ్రీరామనవమిని పురస్కరించుకొని మొదలైన చదలవాడ రఘునాయకస్వామి 235వ వార్షిక కళ్యాణోత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి స్వామి వారు హంస వాహనంపై గ్రామంలో ఊరేగారు. ఆలయ పండితులు స్వామి వారికి వేద మంత్రాల నడుమ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈవో అనిల్ కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పొదిలి సీఐకి సన్మానం

పొదిలి: పొదిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కేవీ రాఘవేంద్ర ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు పలువురు సీఐని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. జీసీ సుబ్బారావు, కంకణాల రమేష్, సామి రాజా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, జి.చెన్నారెడ్డి, గూడూరి వినోద్, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, ఫిరోజ్ తదితరులు ఉన్నారు.

అంతర్ పంటలతో పురుగు నిర్మూలన


క్రిమిసంహారక మందుల కోసం పంట కోత ప్రయోగం చేస్తున్న అధికారులు

కొత్తపట్నం: ప్రకృతి వ్యవసాయం సాగుబడి చేస్తున్న పంటలకు అంతర్ పంటలు వేస్తున్నారు. పురుగు మందులు, సేంద్రియ ఎరువులు వాడకుండా తెగుళ్ల, పురుగులు నాశనానికి అంతర్ పంటలతో నిర్మూలిస్తున్నాయి. దీనితో పంట ఆరోగ్యంగా ఉండి దిగుబడులు అధికంగా చవి చూస్తున్నారు. గాదెపాలెం గ్రామానికి చెందిన గుత్తికొండ ఝాన్సీలక్ష్మి, చేజర్ల సుజాత ఇద్దరు మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో శనగ పంటను సాగుబడి చేస్తున్నారు. ఇందులో అంతర్ పంటలుగా ఆవాలు, ధనియాలు, జొన్నలు సరిహద్దుల్లో వేశారు. ప్రీమూన్ డ్రై సోయింగ్ విధానంలో 16 రకాల విత్తనాలు చల్లుకున్నారు. పచ్చరొట్టి ఎరువులతో సమానంగా అంతర్ పంటలు పనిచేస్తున్నాయి. ప్రకృతి విధానంలో కషాయాలు తయారు చేసి పిచికరీ చేస్తున్నారు. సాగుబడి చేసిన పంటలను పంటకోత ప్రయోగం చేసి ల్యాబ్‌కు పరీక్షలకు పంపడంతో 100 శాతం పురుగు మందులు లేని ధాన్యంగా నిర్ధారించారు. తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు పంటకోత ప్రయోగం చేసి పురుగు మందులు లేని పంటలుగా గుర్తించి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం సాగుబడి చేస్తున్న శనగలు తిరుపతి లడ్డూ కోసం వినియోగిస్తున్నారు. గత ఏడాది 2 టన్నులు కొనుగోలు చేయగా ఈ ఏడాది శనగలు కొనుగోలు కోసం పరీక్షలు చేయిస్తున్నారు. మండలంలో నూరు శాతం ప్రకృతి వ్యవసాయం సాగుబడి చేయాలని ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

బుద్ధిస్ట్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక


బుద్ధిస్ట్ సొసైటీ నూతన కార్యవర్గం సభ్యులు

చీమకుర్తి: సంతనూతలపాడు మండల స్థాయి బుద్ధిస్ట్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంతనూతలపాడు సామాజిక భవనంలో ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా మార్పుడి వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్.మల్లికార్జున, జనరల్ సెక్రటరీగా కె.అనిల్, సెక్రటరీగా డి.శ్రీను, ట్రెజరర్‌లుగా కె.రామకృష్ణ, బి.రాజేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.శివన్నారాయణను ఎన్నుకున్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి ఎడ్లూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ బుద్ధిస్ట్ సొసైటీ ఆశయాలు, లక్ష్యాలు, పంచశీల విధానాలను వివరించారు. జిల్లా అధ్యక్షులు ఇ.మహేష్, బాలగురవయ్య, సీహెచ్.వెంగయ్య, పాలేటి రవీంద్ర, మార్పుడి రామాంజనేయులు, దాసరి ప్రకాశం, పాలడుగు రవివర్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి హరిహర క్షేత్రం వార్షికోత్సవం


సిద్ధమైన చీమకుర్తిలోని హరిహర క్షేత్రం

ఒంగోలు: చీమకుర్తిలోని శ్రీహరిహర క్షేత్రం 17వ వార్షికోత్సవ కార్యక్రమాలు ఈనెల 4,5 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకులు శిద్దా రాఘవరావు, ఆలయ ధర్మకర్తలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రతిష్ఠ జరిగి 16 సంవత్సరాలు పూర్తయి సప్తాదశవ వార్షికోత్సవంలోకి అడుగుపెట్టిన సందర్భంగా విశాఖ శారద పీఠం శ్రీమత్ పరమహంస పరివ్రాజకాచార్య జగద్గురు శంకరాచార్య, స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర మహాస్వామి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామి వారు శ్రీహరిహర క్షేత్రంలో జరిగే కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొని భక్తుల కోసం అనుగ్రహ సంభాషణలు ఇస్తారన్నారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ ఆలయాల ఆస్థాన పండితులు, రాష్ట్రంలో ప్రఖ్యాతి గాంచిన వేద పండితులు పాల్గొంటారన్నారు. రెండు రోజులపాటు జరిగే హోమాలు, విశేష పూజా కార్యక్రమాలు, అయ్యప్పస్వామి మహాపడి భజన, మహా పూర్ణాహుతి, నగరోత్సవం, శాంతి కళ్యాణంలో భక్తులు పాల్గొని స్వామివారి కృపా కటాక్షాలు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించాలని శిద్దా రాఘవరావు, ధర్మకర్తలు భక్తులకు విజ్ఞప్తి చేశారు.

శింగరకొండ ట్రస్ట్ బోర్డు నియామక ఉత్తర్వులు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానికి గత ట్రస్ట్ బోర్డు పదవి కాలం ముగియడంతో నూతన ట్రస్ట్ బోర్డు నియామకం కోసం జిల్లా ఎండోమెంట్ అధికారుల నుంచి ఉత్తర్వులు అందినట్లు దేవస్థాన ఈవో సుభద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రస్ట్ బోర్డు నియాయక నోటిసు ప్రకటించిన తేదీ నుంచి 20 రోజుల్లోపు అర్హులైన వారు బోర్డు నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

సొసైటీ బాధితుల ర్యాలీ

వేటపాలెం: వేటపాలెం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ బాధితులకు ఎంతకాలానికి న్యాయం జరుగుతుందని ప్రశ్నిస్తున్నారు. సొసైటీ బాధితులు తమకు న్యాయం చేయాలని కోరూతూ ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. బాధితులు మాట్లాడుతూ సొసైటీ నిధులు రూ. 24 కోట్లు గోల్‌మాల్ జరిగి ఒకటిన్న సంవత్సరం దాటిందని గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు కాళ్లు అరిగేలా జిల్లా అధికారులు చుట్టు తిరుగుతున్నా ఇంతవరకు న్యాయం జరగలేదని వాపోయారు.

బైపాస్‌తో ట్రాఫిక్ సమస్య దూరం

అద్దంకి రూరల్: పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను అధిగమించాలంటే తక్షణమే బైపాస్ రోడ్డును ఏర్పాటు చేయాలని బాపట్ల జిల్లా సీపీఎం కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నామ్ రహదారి అద్దంకిలో సుమారు 3కిలో మీటర్ల ఉన్నదని ఈ రహదారిపై రోజుకు వందలాది భారీ వాహనాలు ప్రయాణిస్తున్నాయన్నారు. సమస్యలపై సంబంధిత అధికారులు స్పందించకుంటే ప్రజాసంఘాలను కలుపుకుని పోరాటం చేస్తామన్నారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు


సరస్వతిదేవి అలంకరణలో కోటా సత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్లు కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పదో తరగతి పరీక్షల సందర్భంగా కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమ పూజలు, అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

గుంటి గంగా భవానికి ఘన పూజలు


అలంకరించిన గుంటి గంగా భవాని అమ్మవారు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. నాలుగు చీరలు బహూకరించారు. ఆలయానికి రూ. 3,876 ఆదాయం వచ్చినట్లు ఆర్‌ఏ శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, ఈఓ భాస్కర్ రెడ్డి, ఆలయ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.